క్లుప్తంగా

నేటి వరకు రైలు గేటు మూసివేత

పెడన: పెడన–గూడూరు రోడ్డులోని రైల్వే గేటును ఈ నెల 24వ తేదీ నుంచి 26వ తేదీ రాత్రి ఏడు గంటల వరకు మూసి ఉంచుతామని చెప్పిన రైల్వే అధికారులు మరో రోజుకు పొడిగించారు. అనుకున్న సమయానికి ట్రాక్ మరమ్మతు పనులు పూర్తి కాకపోవడంతో గురువారం రాత్రి ఏడు గంటల వరకు రైలు గేటు మూసి ఉంటుందని అధికారులు తెలిపారు.

ఘనంగా షిర్డీ సాయి మందిరం వార్షికోత్సవం



బందలాయిచెరువు(అవనిగడ్డ): బందలాయిచెరువు షిర్డీ సాయి జ్ఞాన మందిరం 8వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. బాబా విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ నిర్వాహకురాలు సింహాద్రి లక్ష్మీ పర్యవేక్షించారు.

బీచ్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం

కాపాడిన మెరైన్ పోలీసులు


కోనేరుసెంటర్: మంగినపూడి బీచ్‌లో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన మెరైన్ పోలీసులు యువకుడిని కాపాడారు. విజయవాడ అయ్యప్ప నగర్‌కు చెందిన యువకుడు ఎండీ తహిర్‌బాషా బుధవారం మంగినపూడి బీచ్‌కు వచ్చాడు. స్నానం చేస్తూ లోతుకు వెళ్లిపోయాడు. అలల మధ్య మునిగిపోతుండగా బీచ్ వద్ద పెట్రోలింగ్ డ్యూటీ నిర్వహిస్తున్న మెరైన్ ఏఎస్ఐ పరింకాయల మురళీకృష్ణ, హోంగార్డు స్వామి, తాలూకా స్టేషన్‌కు చెందిన నాగరాజు గమనించి తహిర్ బాషాను కాపాడారు. యువకుడిని ప్రశ్నించగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యకు యత్నించినట్లు పోలీసులకు తెలిపాడు. వెంటనే అతడిని బందరు తాలూకా పోలీస్‌స్టేషన్‌కు తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. ఓ వ్యక్తి ప్రాణాలను కాపాడిన మెరైన్, తాలూకా పోలీసులను పలువురు అభినందించారు.

కొక్కిలిగడ్డపై పెదప్రోలు జట్టు విజయం



మోపిదేవి: స్థానిక జెడ్పీ పాఠశాలలో జరుగుతున్న క్రికెట్ టోర్నీలో కొక్కిలిగడ్డ జట్టుపై పెదప్రోలు జట్టు విజయం సాధించిందని నిర్వాహకులు మలిశెట్టి శ్రీనివాసరావు, కారుమూరి శివ నాగరాజు తెలిపారు. బుధవారం ఉదయం జరిగిన పోటీల్లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన పెదప్రోలు జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 107 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కొక్కిలిగడ్డ జట్టు 9 వికెట్లు కోల్పోయి 80 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలయ్యింది. 25 పరుగులు చేసి మూడు వికెట్లు తీసిన పెదప్రోలు జట్టు కెప్టెన్ బవిర్తి వెంకట రమణను మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు వరించింది. అవార్డును ఎంపీటీసీ సభ్యులు కారుమూరి శివనాగరాజు చేతుల మీదగా అందజేశారు. మోపిదేవి శివ, కొండపల్లి గోపి ఎంపైర్లుగా వ్యవహరించారు. యడ్ల ప్రసాద్ పర్యవేక్షించారు.

మజ్జిగ పంపిణీ



మచిలీపట్నంటౌన్: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. ప్రధాన రహదారిలో వెళ్లే పాదచారులకు మజ్జిగను పంపిణీ చేశారు. సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్, జిల్లా వేద కో–ఆర్డినేటర్ పాతూరి జ్ఞానేశ్వరశర్మ, విద్య విభాగ కో–ఆర్డినేటర్ పి. వరప్రసాద్, మహిళా సేవాదళ్ సమన్వయకర్త కొట్టె నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పకు అభిషేకాలు

మచిలీపట్నంటౌన్: గాంధీ బొమ్మ శివాలయం ఆవరణలోని అయ్యప్ప స్వామి వారికి బుధవారం ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి 32వ వార్షిక ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన బుధవారం వెయ్యి మంది సువాసినీలు లలితా సహస్రనామ పారాయణ చేశారు. స్వామివారికి సహస్ర నామార్చన చేశారు. లలితా పరమేశ్వరి అమ్మవారికి 152 రకాల నైవేద్యాలను సమర్పించారు. ఆలయ భక్తబృందం ప్రతినిధులు పర్యవేక్షించారు.

ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధం

- ఆర్‌బీకేల వద్ద కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- ధాన్యం నిల్వలపై ఇటీవల సర్వే చేసిన అధికారులు
- పెడన నియోజకవర్గంలో 34,702 మెట్రిక్ టన్నుల నిల్వ



నడుపూరులోని ఆర్‌బీకే వద్ద టెక్నికల్ అసిస్టెంట్‌కు పత్రాలను సమర్పిస్తున్న రైతు

పెడన: రైతుల వద్ద ఉన్న ధాన్యం నిల్వలను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పెడన నియోజకవర్గంలోని ప్రతి రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంది. రైతులు ఖరీఫ్ సీజన్‌లో తమ పంటలను కుప్పలుగా వేసి ఉంచారు. ఆరుతడి పంటలు మినుము పూర్తయిన తరువాత కుప్పలను తీసి నూర్పిళ్లు చేశారు. 2022 నవంబర్ నుంచి డిసెంబర్, 2023 జనవరి, ఫిబ్రవరి వరకు కొనుగోలు కేంద్రాలు తెరిచి ఉంచారు. రైతుల నుంచి డిమాండ్ రావడంతో మరో నెల రోజులు పొడిగించడంతో పాటు ఆన్‌లైన్‌లో కాకుండా పది రోజులు పాటు ఆఫ్‌లైన్‌లో కూడా రైతులకు అవకాశం కల్పించారు. అయినా కొందరు రైతులు ముందుకు రాలేదు. దీంతో ప్రభుత్వం కేంద్రాలను ఎత్తివేసింది. వాతావరణం అనుకూలించడంతో పాటు ఆరుతడి పంటలు కూడా తీసేసి వరి నూర్పిళ్లు చేసి ధాన్యం ఆఫ్‌లైన్‌లో మిల్లర్లకు విక్రయించడానికి కొందరు రైతులు ప్రయత్నాలు చేశారు. అయితే వారు తక్కువ ధర చెబుతుండటంతో తమ వద్ద ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ప్రజాప్రతినిధులను కోరారు. పెడన నియోజకవర్గంలో రైతులు మంత్రి జోగి రమేష్ దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లగా ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలోనే రైతులు వద్ద ధాన్యం నిల్వలు ఏ మేరకు ఉన్నాయనే దానిపై స్పష్టమైన నివేదికలు ఇవ్వాలని ప్రభుత్వం కోరింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్నతాధికారులతో పాటు డివిజన్, మండల స్థాయి అధికారులతో సర్వే చేయించింది.

34,702 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు...

పెడన నియోజకవర్గంలో 34,702 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు ఉన్నట్లు సర్వేలో తేలింది. గూడూరు మండలంలో అత్యధికంగా ధాన్యం నిల్వలున్నాయి. గూడూరు మండలంలో 16,327 మెట్రిక్ టన్నులు, పెడన మండలంలో 15,811 మెట్రిక్ టన్నులు, బంటుమిల్లిలో 2,538 మెట్రిక్ టన్నులు, కృత్తివెన్నులో 26 మెట్రిక్ టన్నుల నిల్వలున్నాయి. వీటిని కొనుగోలు చేసేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆర్‌బీకేల వద్ద తెరిచి ఉంచారు. రైతుల నుంచి ఆధార్, బ్యాంకు ఖాతా పుస్తకం, పట్టదారు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలను తీసుకుని ఆన్‌లైన్ చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాం



మండలంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు ప్రతి ఆర్‌బీకే పరిధిలో ధాన్యం నిల్వలపై సర్వే చేశారు. ఆ నిల్వల లెక్క తేలడంతో వాటిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను తెరిచింది. ప్రతి ఆర్‌బీకే పరిధిలో కేంద్రాలున్నాయి. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మళ్లీ గడవు పెంచదు. రైతులు గమనించి తెరిచిన వెంటనే తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకోవాలి.

– జీవీ శ్రీనివాసరావు, ఏఓ, పెడన

ఇంటింటా అపూర్వ ఆదరణ

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- రామకృష్ణాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోడూరు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రతి ఇంటా అపూర్వ ఆదరణ లభించింది. మండలంలోని రామకృష్ణాపురం సచివాలయ పరిధిలోని ఊటగుండం, బసవానిపాలెం, పిండివానిదిబ్బ తీరప్రాంత గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయా గ్రామాల్లోని 356 ఇళ్లకు వెళ్లి కుటుంబాలు పొందిన సంక్షేమ లబ్ధిని వివరించి, ప్రభుత్వ పాలన గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు తమకు అందుతున్నాయని గ్రామస్తులు ఎమ్మెల్యే వద్ద తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. గతంలో కార్యాలయాల చుట్టూ తిరిగితే తప్ప పనులు అయ్యేవి కాదని, ప్రస్తుతం కార్యాలయాలకు వెళ్లకుండా వలంటీర్లే ఇంటికి వచ్చి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారని చెప్పారు. తమను చల్లగా చూసుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తాము అండగా ఉంటామని తీరప్రాంత గ్రామాల ప్రజలు తెలిపారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం..

కులమతాలకు, పార్టీలకు అతీతంగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే రమేష్‌బాబు అన్నారు. తీరప్రాంత గ్రామాల్లో ప్రభుత్వానికి మంచి ఆదరణ లభిస్తోందని చెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రహదారులు, తాగునీటి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని రమేష్‌బాబు చెప్పారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ గుర్రం బసవయ్య, బీసీ, ఎస్సీ సెల్ కన్వీనర్లు చేబోయిన కృష్ణారావు, వెన్నా ప్రసాద్, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, చేబోయిన లీలావతి, ఎంపీడీఓ పాండురంగారావు, ఎంఈఓ టీవీఎం రామదాసు, ఏఓ భానుప్రకాష్, కార్యదర్శులు ఏడుకొండలు, సుబ్బారావు పాల్గొన్నారు.

అనీమియా నివారణకు చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): పిల్లలు, గర్భిణుల్లో అనీమియా నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన చాంబర్‌లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై సమావేశం నిర్వహించారు. కౌమారదశ బాలికలు, గర్భిణుల్లో రక్తహీనత శాతం, ఐదేళ్ల కంటే తక్కువ వయస్సు కలిగిన పోషకాహార లోపం గల పిల్లల శాతం, ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు వంటి అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులు, పిల్లల్లో అనీమియా నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఐరన్‌ఫోలిక్ యాసిడ్ మాత్రలు క్షేత్రస్థాయిలో పంపిణీ జరుగుతున్నదీ, లేనిదీ వైద్య, విద్య శాఖాధికారులు సమన్వయం చేసుకుంటూ నిత్యం పర్యవేక్షించాలన్నారు. అనీమియా బాధితులకు టాబ్లెట్లు ఇచ్చేటప్పుడు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు.

ఆధార్ అప్‌డేట్ ఇంకా 40 శాతం జరగాల్సి ఉందని వలంటీర్ల సహకారంతో ప్రజల్లో అవగాహన కలిగించి ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. డీఈఓ తాహెరాసుల్తానా, డీఎంహెచ్‌వో గీతాబాయి, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, సీపీఓ వై. శ్రీలత పాల్గొన్నారు.

మంచినీటి చెరువు అభివృద్ధి

కొత్తమాజేరు(చల్లపల్లి): ఉపాధి పథకం ద్వారా కొత్తమాజేరులోని రక్షిత మంచినీటి చెరువును అభివృద్ధి చేశారు. చెరువు చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను ఉపాధి కూలీలు తొలగించారు. పనులను సర్పంచ్ కోట్లపల్లి లక్ష్మి, ఎంపీటీసీ తమ్ము లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు కోట్లపల్లి లక్ష్మీనారాయణ, తమ్ము మనోజ్ పరిశీలించారు.

ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలి

గూడూరు: గత సంవత్సరం ఖరీఫ్‌కు సంబంధించి ఇంకా రైతుల వద్ద మిగిలి ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు కృష్ణాజిల్లా డీఎం శ్రీధర్‌కు విజ్ఞప్తి చేశారు. గూడూరు మండలం పరిషత్ కార్యాలయంలో సివిల్ సప్లయీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులతో ఎంపీపీ సమావేశం నిర్వహించి పలు అంశాలు చర్చించారు. జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గొరిపర్తి రవికుమార్, తలుపుల కృష్ణ, జక్కా ధర్మారాయుడు, సాంబశివయ్య, నేతల కుటుంబరావు పాల్గొన్నారు.

వివేకానంద విద్యార్థుల ప్రతిభ



కోదాటి నవ్య



లుక్కు సాహితీ మేఘన



కోరుకొండ రమాదేవి



యార్ల శశాంత్

చల్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఎంపీసీ సెకండియర్ ఫలితాల్లో కోరుకొండ రమాదేవి 987/1000, లుక్కు సాహితీ మేఘన 987/1000, యార్ల శశాంత్ 987/1000, కోదాటి నవ్య 987/1000 మార్కులు సాధించారు. సెకండియర్ సీఈసీలో కర్రా కృష్ణమోహనరావు 972/1000, ఎంపీసీ ఫస్టియర్‌లో కొడాలి తేజస్విని 464/470 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కరస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్, ప్రిన్సిపాల్ రమేష్ అభినందనలు తెలిపారు.

ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవాలు

గుడ్లవల్లేరు: కౌతవరంలో తొమ్మిదేళ్లకు ఒకసారి జరిగే మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవాలు బుధవారం కొనసాగాయి. పోతురాజు గెడ ఊరేగింపును ఉత్సవ కమిటీ వారు సంప్రదాయ బద్ధంగా గ్రామంలోని ప్రధాన రహదారుల వెంబడి ఊరేగింపు నిర్వహించారు. మహిళా భక్తులు అడుగడుగునా పండ్లు, టెంకాయలను సమర్పించి నీరాజనాలు అర్పించారు.

పిడుగుపాటు బాధితులకు ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శ



చల్లపల్లిలో మస్తాన్ కుమారులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

చల్లపల్లి: పిడుగుపాటు బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు బుధవారం పరామర్శించారు. ఇటీవల అకాల వర్షాలకు పడిన పిడుగుల కారణంగా చల్లపల్లి నారాయణరావు నగర్‌కు చెందిన షేక్ మస్తాన్ మృతిచెందాడు. మస్తాన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని కుమారులతో మాట్లాడి తమ వంతు సహాయం అందిస్తామని తెలిపారు. అనంతరం లక్ష్మీపురం శివారు రామానగరంలో పిడుగుపాటు శబ్దానికి భయపడి ఇంటి వద్ద మృతి చెందిన వృద్ధురాలు కొల్లూరి నాంచారమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. నాంచారమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామానగరంలో పిడుగుపాటుకు కౌలు రైతు కొమ్మన నారాయణ వరిగడ్డి వామి కాలిపోగా బాధితుడిని పరామర్శించారు. తమవంతు సహాయంగా రెండు ఎకరాల వరిగడ్డి సమకూర్చుతామని ఎమ్మెల్యే రైతు నారాయణకు భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మోపిదేవి ద్వారకానాథ్, తుమ్మల వెంకటేశ్వరరావు, లక్ష్మీపురం సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్లు, ఎంపీటీసీ, ఏఎంసీ డైరెక్టర్ పాల్గొన్నారు.

రికార్డులను సక్రమంగా నిర్వహించండి

మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ



రికార్డులు పరిశీలిస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ సూరిబాబు

మచిలీపట్నంటౌన్: నగర పాలక సంస్థ కార్యాలయంలో సిబ్బంది రికార్డులను సక్రమంగా నిర్వహించాలని మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ అన్నారు. కార్యాలయంలోని పలు విభాగాలను బుధవారం ఆమె పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్లు, పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఉద్యోగులు సమయ పాలన పాటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ నెలాఖరులోగా ఇంటి పన్నులు చెల్లిస్తే ఐదు శాతం రాయితీ వస్తున్నందున ప్రజలు పన్నులు చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. పన్నులు చెల్లించేందుకు వచ్చే ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చూడాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు బడే భానుతేజ పాల్గొన్నారు.

విద్యతోనే ఆర్థిక అసమానతలు దూరం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- ఘనంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం




క్రీడా విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, కడవకొల్లు

అవనిగడ్డ: విద్యతోనే సామాజిక, ఆర్థిక అసమానతలు దూరమవుతాయని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ మానవీయ విలువలు కాపాడే మంచి సమాజం కోసం విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి ఉండాలని చెప్పారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 20 సంవత్సరాల కిందట ముఖ్యమంత్రి అయి ఉంటే ప్రపంచ స్థాయిలో మన తెలుగు వారు మరింత సత్తా చాటేవారని అన్నారు. నాడు–నేడు, అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, విద్యా, వసతి దీవెన, ఇంగ్లిష్ మీడియం వంటి కార్యక్రమాల వల్ల డ్రాపవుట్స్ తగ్గడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ఈ కాలేజీలో చదువుకున్న అంబటి రాంబాబు, కనకమేడల రవీంద్ర, పర్చూరి అశోక్‌బాబు, తాను ఒకేసారి చట్టసభలకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించేవరకూ శ్రమించాలన్నారు. ఈ సందర్భంగా పలు విభాగాల్లో పథకాలు సాధించిన విజేతలకు నగదు ప్రోత్సాహకాలను ఎమ్మెల్యే అందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఏపీపీ నరహరశెట్టి ఈశ్వరరావు, ఎస్‌పీఎల్ క్రాంతి విద్యా సంస్థల అధినేత దుట్టా ఉమామహేశ్వరరావు, మొవ్వ, కంచకచర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్ సూరగం జగన్‌మోహన్‌రావు, నీరజ, గాయకుడు బాలాజీసింగ్, ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్

ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్



చినగొల్లపాలెంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

కృత్తివెన్ను: నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ అభివృద్ధి ఫలాలను పొందుతూ ఉన్నత పదవుల్లో ఉన్నారంటే ఆనాడు అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమే కారణమని ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. కృత్తివెన్ను మండలం చినగొల్లపాలెంలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని బుధవారం విక్టర్ ప్రసాద్ ఆవిష్కరించి మాట్లాడారు. అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులతో బహుజనులంతా అన్ని రకాల అభివృద్ధి ఫలాలను పొందగలుగుతున్నారన్నారు. వయోపరిమితితో అందరికీ ఓటు హక్కును ప్రసాదించిన మహానుభావుడు అంబేడ్కర్ అని అన్నారు. ఆయన చూపిన మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో విగ్రహ దాత బీఎస్ఎన్ఎల్ అర్జా, ఎంపీడీఓ పిచ్చిబాబు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, సర్పంచ్ సునీల్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి



బందరులో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన విక్టర్‌ప్రసాద్, మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక సర్కిల్‌పేట ఆర్‌సీఎం చర్చి సమీపంలో ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని బుధవారం రాత్రి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి జీవితాంతం శ్రమించిన వ్యక్తి అంబేడ్కర్ అని చెప్పారు. భారత రాజ్యాంగంలో బడుగు, బలహీనవర్గాల వారికి పలు హక్కులు, రిజర్వేషన్లు పొందుపరచబట్టే నేడు ఆయా వర్గాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాయని వివరించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మాట్లాడుతూ అంబేడ్కర్ సేవలను కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, కార్పొరేటర్ ఏకశిరి వెంకటేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, రాష్ట్ర క్రిష్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు మాట్లాడారు. తొలుత సర్కిల్‌పేటలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు కృషి చేసి మృతి చెందిన కొండ్రు శామ్యూల్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న కేంద్ర ప్రభుత్వం

బంటుమిల్లి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను అంబాని, అదానీల పాలు చేస్తోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి. రంగారావు విమర్శించారు. నాగేశ్వరరావుపేట పంచాయతీ శివారు జానకిరామాపురం గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆయిల్, పెట్రోల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలతో సామాన్య ప్రజలు జీవించలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వ ఆస్తులను కేంద్రప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తోందని దుయ్యబట్టారు. సీపీఎం, రైతు సంఘం, ఐద్వా నాయకులు పాల్గొన్నారు.

108 మందికి వైద్య సేవలు



కప్తానుపాలెం(మోపిదేవి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ వైద్యం అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ ఫిజీషియన్ ఏర్పాటు చేశారని పెదకళ్లేపల్లి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ హారిక అన్నారు. కప్తానుపాలెంలో 104 వాహనం ద్వారా బుధవారం వైద్యసేవలు అందించారు. రక్తపోటు, మధుమేహం వ్యాధిగ్రస్తులు 96 మందికి, బాలింతలు, గర్భిణులు 12 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులు అందజేశారు. అనంతరం ఫీల్డ్ విజిట్ నిర్వహించి మట్టావానిగూడెం ప్రాథమిక పాఠశాల, కప్తానుపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఐరన్ మాత్రల ప్రాధాన్యతను వివరించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంఎల్ హెచ్‌పీ శిరీష, ఏఎన్ఎం దుర్గ పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

సచివాలయ ఉద్యోగుల ఆర్థిక సాయం



కోనేరుసెంటర్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఎస్ గొల్లపాలెం పశు సంవర్థక సహాయకుడికి గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. మోతుకూరి నాగేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న అర్బన్, రూరల్ ఏరియాలకు చెందిన సచివాలయ సిబ్బంది రూ. 23,116 సేకరించి బుధవారం నాగేశ్వరరావును కలిసి ఈ మొత్తాన్ని అందజేశారు. జిల్లా అధ్యక్షుడు కోలా నాగబాబు, ఉపాధ్యక్షులు కర్రా అశోక్‌కుమార్, కలపాల దినేష్‌తేజ, కార్యనిర్వాహక కార్యదర్శి ధరావత్ విజయ్‌నాయక్, కార్యవర్గ సభ్యులు కాగిత లక్ష్మణరావు, సాధన, శివాజీ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.